ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 5 జనవరి 2025 | 5



నువ్వే మా గేమ్ చేంజర్ : బాబాయ్ పవన్‌ను హత్తుకున్న రామ్‌చరణ్

గేమ్ చేంజర్ షో

డిప్యూటీ సీఎం పవన్.. మెగా హీరో రామ్‌చరణ్.. దర్శకుడు శంకర్ ఇలా అతిరథ మహారథులందరూ వస్తుంటే.. అభిమానం ఊరుకుంటుందా.. ఎగసిపడింది.. ఉవ్వెత్తున ఉరకలేసింది.. తమ అభిమాన నటీనటులను నేరుగా చూడాలని ఎక్కడెక్కడి నుంచో తరలిరావ డంతో వేమగిరి జనసంద్రమైంది.. ఇసుకేసినా రాలనంత జనం.. ఎక్కడి నుంచి వచ్చారో కానీ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచే జాతీయ రహదారి యువతతో నిండిపోయింది.. సాయంత్రం ఐదు గంటలయ్యే సరికి కిక్కిరిసిపోయింది.. అభిమానులను అదుపుచేయడం ఎవరితరం కాలేదు..వీవీఐపీ.. వీఐపీ పాస్‌లు పనిచేయలేదు.. అయినా అభిమానులు కదల్లేదు.. జై పవన్.. జై రామ్‌చరణ్ అంటూ ముందుకు కదిలారు..గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను విజయవంతం చేశారు. - వివరాలు 6లో



వేదికపై మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శంకర్, సూర్య, దిల్ రాజు



స్టేజీపై యాంకరింగ్ చేస్తున్న అంజలి, సుమ



అభిమాన దండ...



మాట్లాడుతున్న దర్శకుడు శంకర్



అభిమాన సంద్రం: వేమగిరిలో కిక్కిరిసిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రాంగణం



మధ్యాహ్నం స్టేజ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు

ముగ్గు మనోహరం

ఉత్సాహంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ



ముగ్గులు వేస్తున్న మహిళలు

అమలాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థ ఉభయ రాష్ట్రాల పరిధిలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మహిళలు ఒకరికి మించి ఒకరు ముగ్గులు వేసి న్యాయనిర్ణేతలకే పరీక్ష పెట్టారని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ సంయుక్త ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో శనివారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ కల్చర్ వల్ల గృహిణులకు వాకిల్లే కరువయ్యాయని దీంతో సంస్కృతిని ప్రతిబింబించే ముగ్గులు పూర్తిగా మరిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ తరుణంలో ఆంధ్రజ్యోతి యాజమాన్యం ముందుకు వచ్చి పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతీ ఏటా ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీకి తానే స్పాన్సర్‌గా వ్యవహరిస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ మాట్లాడుతూ మహిళల ఆదరణ తగ్గుతుండడంతో నిర్వాహకులు పోటీలు నిర్వహించడానికి కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నారని, అయితే ఇక్కడ మాత్రం మహిళలు ముఖ్యంగా యువతులు అధిక సంఖ్యలో హాజరైన తీరు ఆనందాన్నిచ్చిందని అన్నారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు ఇంత మంది మహిళలు హాజరు కావడం అభినందనీయమన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు మాట్లాడుతూ మహిళల కంటే యువతులే ఎక్కువ వచ్చి పోటీల్లో పాల్గొన్న తీరును ప్రశంసించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సీనియర్ జర్నలిస్టు టీకే విశ్వనాథ్, టీడీపీ నాయకుడు సాధనాల ఆదిశేషు పాల్గొన్నారు. ముగ్గుల పోటీకి న్యాయ నిర్ణేతలుగా సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వేదనభట్ల సాయిలక్ష్మి, ఆర్యవైశ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు యెండూరి సీత, డ్రాయింగ్ టీచర్ అరిగెల అర్జున్ వ్యవహరించారు.
కార్యక్రమంలో కోనసీమ జిల్లా ఇన్‌చార్జి ఆచంట వెంకట్, ఆంధ్రజ్యోతి అడ్వర్టైజ్‌మెంట్ స్టాఫ్ (అమలాపురం) అడపా శ్రీనివాసరావు, ఉండపల్లి సతీష్ (రాజోలు), తోట ప్రభాకర్(రావులపాలెం) సర్క్యులేషన్ సీవో ప్రవీణ్, ఏబీఎన్ హాస్పెన్, విలేఖరులు జి.ప్రకాష్, జి.గోపి, ఐ.ప్రఫుల్‌కుమార్, వై.కొండలరావు, ఆకుల సత్యనారాయణ, సీహెచ్‌ఎల్‌ఎస్ నాయుడు, బొబ్బిలి ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, పి.నాగు, పి.సర్వేశ్వరరావు, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటి బహుమతి సాధించిన ముగ్గు



ఎంతో ఆనందంగా ఉంది



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన జిల్లాస్థాయి ముగ్గుల పోటీలో ప్రథమస్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. గత ఏడాది ప్రథమ సాధించాలన్న లక్ష్యంతో ఎంతో సాధన చేశా. కన్సోలేషన్ బహుమతితో సరిపెట్టుకున్నా. ఈ సారి ప్రథమస్థానం సాధించాలనే కృతనిశ్చియంతో వచ్చి సాధించా.

వైదేశి సావిత్రి, రావులపాలెం (ప్రథమస్థానం)



మొదటి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



ద్వితీయ బహుమతి అందిస్తున్న దృశ్యం



తృతీయ బహుమతి అందిస్తున్న దృశ్యం



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



మాట్లాడుతున్న ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్

ద్వితీయస్థానం సాధించిన ముగ్గు



పట్టుదలతో వచ్చా..సాధించా



ఈ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒకటి ఖచ్చితంగా సాధించాలన్న పట్టుదలతో వచ్చా. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆతిథ్యం ఎంతో బాగుంది. భవిష్యత్తులో జరిగే పోటీల్లో ప్రథమస్థానం సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.

ములికి నాగలక్ష్మి, చింతలపల్లి (ద్వితీయస్థానం)

తృతీయ బహుమతి సాధించిన ముగ్గు



పోటీలు కళాత్మకంగా జరిగాయి



ముగ్గుల పోటీ ఎంతో కళాత్మకంగా సాగింది. గతానికంటే భిన్నంగా పోటీతత్వంతో మహిళలు, యువతులు ముగ్గులు వేశారు. పోటీతత్వం పెంచుకునేలా పోటీలు జరిగాయి. కళాత్మకంగానే వేసిన ముగ్గుకు బహుమతి రావడం ఆనందంగా ఉంది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎప్పుడు ముగ్గుల పోటీలు నిర్వహించినా ముందుంటా.

బీవీడీ నాగలక్ష్మి, బండారులంక (తృతీయస్థానం)

విజేతలు వీరే..

ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిని రావులపాలెంకు చెందిన వి.సావిత్రి (రూ.6వేలు) కైవసం చేసుకున్నారు. రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఎం.నాగలక్ష్మి ద్వితీయ బహుమతి (రూ.4వేలు), అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన బీవీడీ నాగలక్ష్మి తృతీయ బహుమతి (రూ.3వేలు) గెలుచుకున్నారు. రాజోలుకు చెందిన డి.లక్ష్మి, మలికిపురానికి చెందిన డి.నాగజ్యోతి , అమలాపురానికి చెందిన జి.అశ్విని స్పెషల్ కన్సోలేషన్ బహుమతులను, అమలాపురానికి చెందిన ఎన్.సుజాత, ముక్తేశ్వరానికి చెందిన పి.లిఖిత, సంతూర్ గిఫ్ట్‌ను ఆచంట గీతాశరణ్య ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. విజేతలకు ఎమ్మెల్యే ఆనందరావు నగదు, కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఆంధ్రజ్యోతి సంస్థ తరపున ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ నేతలు రమణబాబు, స్వామినాయుడు, సత్తిబాబురాజును ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, యాడ్ మేనేజర్ కృష్ణారావు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

సృజనాత్మకతను వెలికితీసేందుకు
వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనా త్మకతను వెలికి తీయడానికి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్సీలు ఐ.వెంక టేశ్వరరావు, కుడిపూడి సూర్య నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. డీఆర్వో కె.మాధవి మాట్లా డుతూ విద్యార్థుల చెంతకే ఆధునిక పరిజ్ఞానం, భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకువచ్చేందుకు ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి సలీం బాషా మాట్లాడుతూ జిల్లా ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రదర్శ నలుగా నిలవాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 22 మండలాలు నుంచి 110 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయన్నారు.



రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు కాలేజీలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

జిల్లాలోని ఇంటర్ కళాశాలల్లో శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు ఆయా కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు..ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు..

వార్తలు..8లో



గేమ్ చేంజర్ వచ్చేశాడు!



బాబాయ్ ఎలా చెబితే అలా : పవన్ పక్కన చేతులు కట్టుకుని నిలబడిన రామచరణ్

రాజమహేంద్రవరం /కడియం,జనవరి 4 (ఆంధ్ర జ్యోతి) : ప్రముఖ నటుడు రామ్ చరణ్ నటించిన గేమ్‌చేంజర్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు గోదావరి జిల్లాల నుంచే కాక,ఇతర ప్రాంతాలనుంచి అత్యధికంగా యువత తరలివచ్చారు. మహిళలు కూడా భారగా రావడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి హైవే పక్కన బ్రహ్మాండమైన వేదిక మీద ఈవెంట్ జరిగింది. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించి యువతను ఉర్రూత లూగించింది.అంతకుమందు మధురపూడి ఎయిర్‌పోర్టులో రామ్‌చరణ్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కూడా ప్రత్యేక విమానంలో మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడినుంచి రోడ్డు మార్గంలో సభాప్రాంగణానికి చేరుకున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో పవన్, రామ్‌చరణ్ వేదిక మీదకు చేరుకున్నారు. యాంకర్ సుమ సభను ఉత్సాహపరిచారు.గోదావరి ప్రాంతాల్లో సినిమా మొదటి రోజునే చూడడానికి యువత ఇష్టపడతా రని పవన్ అన్నారు.ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి చూపించే విధంగా స్టూడియోలు, స్టంట్ స్కూళ్లు, ట్రైనింగ్ స్కూళ్లు పెట్టా లని నిర్మాతలకు ఆయన సూచిం చారు. పవన్, రామ్‌చరణ్ ఒకే వేదిక మీద ఉండ డంతో అభి మానుల ఆనందా నికి అవధుల్లేవు. మధ్యాహ్నం నుంచే అభిమానులు వేదిక వద్దకు భారీగా చేరుకోవడంకనిపించింది. సాయ ంత్రానికి జనం తాకిడి పెరిగి పాస్‌లు ఉన్న ప్పటికీ లోపలికి పంపించలేదు. సాయంత్రం నుంచి వేదికపై ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, నృతాలతో పలువురు అలరించారు. ఆ తర్వాత సినీ పరిశ్రమకు చెందిన పలువురు మాట్లాడారు. సంగీత దర్శకుడు తమన్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ వేదిక మీద ప్రముఖ దర్శకుడు శంకర్, ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్య,హీరోయిన్ అంజలి, మరో హీరో శ్రీకాంత్, దిల్‌రాజు వంటి వారితో పృథ్వీరాజు తదితరులు అనేక మంది వేదిక మీద ఉండడం అందరికీ సంతో షాన్నిచ్చింది.జిల్లాకు చెం దిన మంత్రి దుర్గేష్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌ దరి,ఆదిరెడ్డి వాసు,బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు హాజరయ్యా రు.రాజమహేంద్ర వరం వైపు నుంచి బొమ్మూరు నుంచి ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. అయినా పోలీసు బందోబస్తు ఉండడంవల్ల అంతా బాగానే జరిగింది.వేమగిరి వైపు నుంచి అధికంగా యువత తరలివచ్చా రు.ఈవెంట్ ఏర్పాట్లను చిరంజీవి రాష్ట్ర యు వత ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రవణం స్వామినాయుడు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ తదిత రులు పర్యవేక్షించారు. బాబాయ్ .. అబ్బాయ్‌లకు గజమాల వేశారు.

నేషనల్ అవార్డు స్థాయిలో రామ్‌చరణ్ నటన : దిల్‌రాజు, నిర్మాత



రాష్ట్రంలో జరిగే అంశాలను గేమ్‌చేంజర్ సినిమాలో చూపించడం జరిగింది.గేమ్‌చేంజర్‌లో నేషనల్ అవార్డు వచ్చే స్థాయిలో రామ్‌చరణ్ నటన ఉంటుంది. సినిమా అందరికీ నచ్చుతుంది. కల్యాణ్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. టిక్కెట్ ధరల పెంపుపై ఏపీ ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు.

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటాడు : శ్రీకాంత్

దర్శకుడు శంకర్ నామీద నమ్మకంతో కారెక్టర్ ఇచ్చా రు. రామ్‌చరణ్‌తో నటించడం ఇది రెండో సినిమా. రామ్‌చరణ్ ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే మనస్తత్వం. ఒక సందర్భంలో దర్శకుడు సుకుమార్ మాట్లాడు తూ గేమ్‌చేంజర్‌కు నేషనల్ అవార్డు వస్తుందని చెప్పడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.





మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు.. స్టేజ్ కింద కూర్చున్న పవన్, రామ్‌చరణ్, శంకర్ తదితరులు ...

మాట్లాడుతున్న హీరో రామ్‌చరణ్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు, తమన్





కూటమి నేతృత్వంలో సినిమా పాలసీ

పేదవారి కంటనీరు తుడవడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజకీయాలను నడుపుతున్నారు. తెలుగు సినీచరిత్రలో తండ్రికి తగ్గ తన యుడిగా గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ అభిమానుల గుండెల్లో స్థానాన్ని సంపా దించుకున్నారు. గేమ్‌చేంజర్ ఈవెంట్ గోదావరి నదీతీరాన వెలసిన రాజమ హేంద్రవరంలో జరగడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర రాజకీ యాల్లో కీలకమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సినిమా పా లసీని తీసుకురావడానికి సిద్ధంగా ఉం ది. దిల్‌రాజు వంటి నిర్మాతలు ఆంధ్రరా ష్ట్రం వైపు కూడా దృష్టిసారించాలి.
- మంత్రి కందుల దుర్గేష్



రామ్‌చరణ్ నటన అద్భుతం..

నా 30 ఏళ్ల సినిమా చరిత్రలో 14 సిని మాలు తీశా. అన్ని సినిమాలను తెలు గులో డబ్బింగ్ చేశాం. డబ్బింగ్ అయినా.. నాపై ప్రేమ చూపారు. మీకు తిరిగి ఏదొకటి ఇవ్వాలన్న ఆలోచనతో పూర్తి తెలుగు సినిమా తీశాను. మొత్తం తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉండేలా సినిమా తీశాం. రామ్‌చరణ్ ప్రతి క్యారెక్టర్ అద్భుతంగా చేశారు. సినిమా బృందంలో పనిచేసిన అందరికీ కృతజ్ఞతలు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంచి మనసున్న వ్యక్తి. ఆయన ఒక్కరే అందరిలోను గుండెను చూసే వ్యక్తి. రాజమహేంద్రవరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉంది.
-సినీ దర్శకుడు శంకర్

ఎట్టకేలకు పయనమవుతున్న స్టెల్లా ఎల్ నౌక

- నేడు అర్ధరాత్రి కాకినాడ యాంకరేజ్‌పోర్టు నుంచి ప్రయాణం
- 26 రోజులు సముద్రంలో పయనించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశానికి...
- రేషన్ బియ్యం ఎగుమతి ఆరోపణలో 55రోజులపాటు కాకినాడ తీరంలోనే ఉండిపోయిన నౌక
- నౌకలో ఉన్న 1320 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం ప్రభుత్వ గోదా ములకు తరలింపు



నేడు అర్ధరాత్రి పశ్చిమ ఆఫ్రికాకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న స్టెల్లా ఎల్ నౌక

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్టెల్లా ఎల్ పనామానౌక బయలు దేరుతుంది. ఆదివారం అర్ధరాత్రి కాకినాడ యా ంకరేజ్ పోర్టు నుంచి బయలుదేరేందుకు సర్వం సిద్ధమైంది. ఈభారీనౌక 26రోజులపాటు సము ద్రంలో పయణించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశంలో కొటోనౌ పోర్టుకు చేరుకుంటుంది. అంటే ఈనెల 31వ తేదీకి గమ్యం చేరుకోగలదని నౌక అధికారులు చెబుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి బయలుదేరుతున్న ఈనౌకలోకి ఎగుమతికి సి ద్ధం చేసిన 52వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేశారు. రేషన్ బియ్యం నౌకలో ఉండ టంతో 55రోజులపాటు కాకినాడ సముద్ర తీరం లోనే నౌక లంగరేసుకుని ఉండిపోయింది. ఈనౌ క నవంబరు 21వ తేదీన కాకినాడ తీరానికి వచ్చింది. దీనిలోకి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ అయిన తర్వాత రేషన్ బి య్యం ఉన్నట్టు అధికారులకు సమాచారం వచ్చి ంది. దీంతో తొలుత జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు చేశారు. తర్వాత డిప్యూటీ సీఎం పవ న్‌కళ్యాణ్ తనిఖీలు నిమిత్తం వెళ్లారు. వాతావ రణం అనుకూలించకపోవడంతో నౌకలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. తర్వాత అధికారుల బృందం వెళ్లి తనిఖీలుచేసి 12న మూనాలు సేకరించారు. 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు ప్రకటించారు. దాదాపు వారం రోజులు శ్రమించి ఆ బియ్యాన్ని దించి ఒడ్డుకు చేర్చారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిగిలిన 19785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ పూర్తి చేశారు. దీంతో నౌక వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. నౌక బయలు దేరుతుంది.

సత్యం బాలాజీపై కేసు నమోదు

సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. సీఎస్‌డీటీ శ్రీనివాసరావు కాకినాడపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సంస్థ యజమాని ప్రదీప్ అగర్వాల్, సూపర్‌వైజర్ కల్యాణపు అశోక్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టెల్లా ఎల్ పనామా నౌకలో 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌కు చెందినవే. ఈ నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, తిరు వీధులలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గోవింద నామస్మరణతో హోరెత్తిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజు ఆదాయం రూ.32.99లక్షలు

ఆత్రేయపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): కోన సీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీ రాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాల బోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తం గా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పా లతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తర లివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పిం చుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనం త రం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వ హించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.32,99,056 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధ రరావు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శన భక్తులను ఎంత గానో ఆకట్టుకుంది.

సత్రం గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి

- ఈవో సుబ్బారావు



శివసదన్ కాటేజీని పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగ దులు ఎప్పటికప్పుడు పరి శుభ్రంగా ఉంచాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. శ నివారం ఆయన శివసదన్ కాటేజీ, విష్ణుసదన్ కాటేజీల ను పరిశీలించారు. భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశిం చారు. గదుల్లో ఏమైనా ఇబ్బందులు, మరమ్మ తులు ఉంటే తక్షణమే పరిష్కారంకావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పె క్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గ ంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చి వాహ నంపై ఆశీనులు గావించి ప్రధాన రాజగోపురం చుట్టూ ముమ్మారు భక్తుల గోవిందనామస్మర ణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రదక్షణ గావించారు. కార్యక్రమంలో సూపరిం టెండెంట్‌లు ఐ.వి.రామారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

లక్ష్యాన్ని చేరుకున్న డొంకరాయి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం



కేక్ కట్ చేసి అభినందనలుతెలుపుకుంటున్న ఉద్యోగులు

మోతుగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యో తి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం జల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంది. 2024-25కి డొంకరాయి విద్యుత్ అథారిటీ అధికారులు 95.14 మిలియన్ యూనిట్లు ఉత్పత్త లక్ష్యంగా నిర్ణయించారు. ఈ టార్గెట్ 2025 మార్చి 31 పూర్తి చేయాల్సి ఉండగా నిర్దేశించిన సమయాని కంటే మూడు నెలల ముందు 2024 డిసెంబరు 26 నాటికి 95.14 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయడంతో అనుకున్న టార్గెట్ పూర్తయిందని అధికారులు తెలి పారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు డొంకరాయి విద్యుత్ కేంద్రంలో సిబ్బందిని అభినంచా రు. దీంతో కేక్ కట్‌చేసి ఉద్యోగస్తులు సంబ రాలు చేరుకున్నారు. కార్యక్రమంలో సూప రింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, ఏడీఈ లు, చంద్రమోహన్, శ్రీనివాసరావు, జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌చరణ్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో, గ్లోబల్ స్టార్ కొణిదెల రామ్‌చరణ్‌కు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జనసేన నాయకుడు తోట నవీన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గేమ్‌ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనేం దుకు ఆయన శనివారం మధురపూడి విమా నాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వాగతం పలికారు.



మధురపూడి విమానాశ్రయం వద్ద రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, తోట పవన్‌కుమార్

ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

- గ్రామంలో భీభత్సం ● తప్పిన ప్రమాదం



బస్సు వెనుక పరుగులు తీస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. నర్సీపట్నం నుంచి ఏలే శ్వరం వెళుతున్న ఆర్టీసీ బస్సు రా జవొమ్మంగి గ్రామ సమీపంలోకి వచ్చే సరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో బస్సులో ఉన్న ప్ర యాణికులు బస్సు వెళుతుండగానే బస్సు నుంచి బయటకు దూకారు. సుమారు కిలోమీటరు మేర బస్సు ముందుకు వెళ్లింది. దీం తో గ్రామస్థులు, బస్సుకోసం వేచివున్న ప్ర యాణికులు దూరంగా పరుగులు తీశారు. బస్సు గ్రామంలోకి వచ్చాక డ్రైవర్ చాకచక్యం గా బస్సును 99 క్వార్టర్స్ వైపు తీశాడు. స్థానికులు బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయిన విషయం గమనించి బస్సు టైర్లకు అడ్డుగా సిమెంట్ ఇటుకలు, తదితర రాళ్లు వేశారు, బస్సువేగం తగ్గడంతో డ్రైవర్ బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేశాడు. ఈ ఆర్టీసీ బస్సు నిత్యం రిపేర్‌లోనే ఉంటుందని, శని వారం ఉదయం ఏలేశ్వరం-నర్సీపట్నం మధ్య లో ఘాట్ రోడ్డులో బస్సు నిలిచిపోయిందని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఘాట్‌రోడ్డులో తిరిగే బస్సులను కండీషన్‌లో ఉండేలా చూడకపోవ డంపై స్థానికులు, ప్రయాణికులు మండిపడు తున్నారు.

వేతనదారులకు తీపి కబురు!

- ఇకపై ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలు
- కనీస వేతనం రూ.300కి పెంపు
- బోగస్ మస్తర్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కమిటీలు
- వేతనదారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేయడంతో పాటు వేతనదారుల కనీస వేతనాన్ని రూ.263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్టవేయడంతో పాటు పనివేళల్లో మార్పులుచేసి వేతనదారులకు గిటుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పనిచేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్లు తనిఖీ చేయాలి. ఈతరహా చర్యలతో వేతనాదారులకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

నిబంధనలు ఇవే..

ఉపాధి వేతనదారులకు వేతనం పెరగడానికి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ముందస్తుగా అంచనాలు తయారుచేయాలి. నేల స్వభావం, వేతనదారుల పనిచేయడానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్తర్లు తనిఖీ చేయాలి. వేతనదారులు చేసే పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాలు రసీదులు కచ్చితంగా ఇవ్వాలి. పనులు చేపట్టే ప్రదేశంలో వేతనదారులకు ప్రథమ చికిత్స కిట్లతోపాటు తాగునీరు సదుపాయం కల్పించాలి. ప్రభుత్వం అందచేస్తున్న టెంట్లు తప్పనిసరిగా పనిచేసే చోట ఏర్పాటుచేయాలి.

బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్తర్ల బాగోతం నడుస్తోంది. వేతనదారులు పనికి రాకపోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్తర్లు వేసి వేతనాలు స్వాహా చేసిన సందర్భాలు ఉన్నాయి. వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన వేతనదారులకు పూర్తిగా వేతనం అందడం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లాస్థాయిలో పర్యవేక్షించే విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు. గత వైసీపీ పాలనలో పలు అక్రమాలు జరిగాయి. దీంతో కూటమి ప్రభుత్వం అమలులోకి వచ్చిన తరువాత అనేకచోట్ల అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారినుంచి రకవరీ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

శ్రమశక్తి సంఘాల పునరుద్ధరణ

గతంలో 20 నుంచి 30 మంది వేతనదారులతో శ్రమశక్తి సంఘాలు (ఎస్ఎస్ఎస్)గా 20 ఏర్పాటుచేసి వారికి మేట్‌లను నియమించేవారు. వారికి ఏటా శిక్షణ ఇచ్చేవారు. ఈసంఘాలు కొన్ని నిర్దిష్టమైన పనులు చేసేవి. మేట్‌లు అందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయంగా ఉండేవారు. దీంతో పథకం సజావుగా సాగేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రమశక్తి సంఘాలను పట్టించుకోకపోవడంతో కనుమరుగయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పనులు సక్రమంగా జరగకపోవడానికి వేతనదారులకు రూ.300 అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మండల స్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి జాబ్ చార్ట్‌పై శిక్షణ, అవగాహన కల్పించనున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనివేళలు



జాబ్ కార్డు ఉన్నవారందరికీ దినసరి వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వేతనదారుల పనివేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పనిచేసేవారు అదనంగా మరో గంట చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం.

-డి.శ్రీలలిత, ఎంపీడీవో, పెద్దాపురం

జీజీహెచ్‌లో ఆంకాలజీ ఐసీయూ ప్రారంభం



ఆంకాలజీ ఐసీయూను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆంకాలజీ విభాగంలో రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డా.పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) శనివారం ప్రారంభించారు. తొలుత మెడిసిన్ విభాగంలో డయాలసిస్ యూనిట్‌కు సంబంధించిన ఆర్వోప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం రూ.10.62 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పాలియేటివ్ ఆంకాలజీ యూనిట్, రేడియేషన్ ఆంకాలజీ యూనిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక ఐసీయూను ఎమ్మెల్యేలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. 2001 బ్యాచ్‌కు చెందిన ఆర్ఎంసీ పూర్వ విద్యార్థి డా.పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు చిన హనుమంతురావ్, పద్మావతి దంపతులు, 2001 ఆర్ఎంసీ పూర్వ విద్యార్థులు కలిసి అందజేసిన నిధుల సాయంతో ఈ ఐసీయూను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసి జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత సమాజంలో క్యాన్సర్ మహమ్మారి ఎక్కువ మందిని పట్టి పీడిస్తుందని ఈ పరిస్థితుల్లో క్యాన్సర్ విభాగాన్ని మరింత అభివృద్ధి పర్చవల్సి ఉందని, ప్రస్తుత ఐసీయూ క్యాన్సర్ పేషెంట్లకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెంట్, ఆంకాలజీ హెచ్‌వోడి డా.శ్రీనివాసన్, మెడిసిన్ హెచ్‌వోడి డా.యశోదమ్మ, రామ్‌కోసా అధ్యక్షుడు డా.ఆనంద్, కార్యదర్శి డా.అరుణాదిత్య, కోశాధికారి డా.తేజోకృష్ణ, టీడీపీ నాయకులు అమన్‌జైన్, మల్లిపూడి వీరు ఉన్నారు.

కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడి మృతి



మణికంఠ (ఫైల్ ఫొటో)

సర్పవరం జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు కోరమండల్ రహదారిలో ఓ కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లో కెళితే కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ (22) బీచ్‌రోడ్డులో గల కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థలో కాంట్రాక్టర్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కంపెనీలో పని ముగించుకుని కర్మాగారం బయట రహదారిపైకి రాగానే అటుగా వస్తున్న ఆదిత్య కాలేజీకి చెందిన బస్సు మణికంఠను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో అస్వస్థతకు గురైన క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు బంధువు ఆర్.గురుమూర్తి ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. త్వరలో ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసేద్దాం అనుకుంటున్న క్రమంలో కుమారుడు మణికంఠ మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు, సోదరిలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతికి కారణమైన కాలేజీ యాజమాన్యం తగిన న్యాయం చేయాలని, లేదంటే మృతదేహంతో కాలేజీ ఎదుట ఆందోళన చేస్తామని బాధితులు హెచ్చరించారు. కాలేజీ యాజమాన్యం మృతుని బంధువులతో చర్చించి, తగిన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

కేశనపల్లిలో ఆవుల అందాల పోటీలు



కేశనపల్లిలో జరిగిన పోటీల్లో ఆవులు

మలికిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు గిరి ఆవుల అందాల పోటీలు కొనసాగాయి. మొదటిరోజు సాయంత్రం పాల పోటీల్లో పాల్గొనే ఆవుల పాలను పూర్తిగా పితికించి మరుసటి రోజు శనివారం రెండు పూటల పాలను లెక్కించారు. అదేవిధంగా పలు విభాగాల పోటీల నిర్వహించారు. పుంగనూరు ఆవులు, గిత్తలు, ఒంగోలు ఆవులు, ఒంగోలు గిత్తలు, గిరి ఆవుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు మొదటిరోజు వివరాలను సేకరించారు. పలు ప్రాంతాల నుంచి ఆవుల అందాల పోటీలను తిలకించడానికి భారీగా జనం వచ్చారు. అంబాజీపేటకు చెందిన వ్యక్తి తీసుకువచ్చిన చిన్న ఎడ్ల బండికి మేకను కట్టి ఒక బాలుడు ఆవరణలో హల్‌చల్ చేశాడు. శుక్రవారం రాత్రి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ ఆవుల అందాల పోటీలను తిలకించారు.





ప్రదర్శనలో ఆవులు..

చిన్న ఎడ్ల బండిలో కూర్చుని సందడి చేస్తున్న బాలుడు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రత్తిపాడులో మృతిచెందిన సతీష్

ప్రత్తిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. స్థానిక పోలీసులు అందించిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం నుంచి తునికి బైక్‌పై వెళుతున్న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కర్రి సతీష్(25) స్థానిక నరేంద్రగిరి హై వేవద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని సతీష్‌మీదుగా దూసుకుపోయింది. దీంతో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మికాంతం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

తరలిరానున్న ఉపాధ్యాయులు

వేదిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ప్రారంభం అవుతున్నాయి. 3రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. రాష్ట్రంలో 26జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది ఉపాధ్యాయులు సభలో కుర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథులు ఆశీనులయ్యే విధంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భారీగా టెంట్‌లు, సభా వేదిక నిర్మించారు. సభకు హాజరైన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా భోజనాలు, అల్పాహారాలు సమకూర్చుతున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం నుంచి జిల్లా కార్యవర్గం అందరూ దీనిలో తలమునకలై ఉన్నారు. ఈ సభను గ్రాండ్‌సక్సెస్ చేయాలనే సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నారు.



మహాసభలకు చేస్తున్న ఏర్పాట్లు

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



మహిళా అభ్యర్థుల పరుగు పందాన్ని పర్యవేక్షిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు దేహదారుఢ్య పరీక్షలను కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ఐదో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో మొత్తం 320 మంది మహిళా అభ్యర్థినులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 203 మంది అభ్యర్థినులు అర్హత సాధించారు. ఈ సామర్థ్య పరీక్షలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.

జేఎన్టీయూకే ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలి

గవర్నర్‌కు సోషల్ యాక్టివిస్ట్ ఫిర్యాదు

జేఎన్టీయూకే, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకేలో జరుగుతున్న పరిపాలన, ఆర్థిక అక్రమ లావాదేవీలపై మూడో పార్టీ ప్రత్యేక ఆడిట్ నిర్వహణతోపాటు కోట్లాది రూపాయిల దుర్వినియోగానికి కారకులైన ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలని కాకినాడకు చెందిన సోషల్ యాక్టివిస్ట్ ఏపీ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకూ ఉన్న ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు తమ ఇష్టారాజ్యంగా నిధులను ఖర్చుచేశారని వారిపై విచారణ చేసి రికవరీ చేయాలని కోరారు. ఆడిట్ వర్గాలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నప్పటికీ డైరెక్టర్లకు పేషీ అలవెన్స్, కారు అలవెన్స్‌లను చెల్లిస్తున్నారన్నారు. అనుబంధ కళాశాలలు కొన్ని బకాయిపడిన ఫీజులను చెల్లించకపోయినా వాటికి అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. త్వరలో భర్తీ కానున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవికి జేఎన్టీయూకే నుంచి చాలా మంది ప్రొఫెసర్లు పోటీపడుతున్నారని సచ్ఛీలురైన వారిని ఎంపికచేసి నియమించాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపకులపతి పదవిని భర్తీచేయడానికి ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ విధానంలో 14వ నిబంధన క్రింద దరఖాస్తుదారుడిపై ఉన్న కోర్టు కేసులు, విజిలెన్స్ కేసుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రతులను రాష్ట్రగవర్నర్‌తో పాటూ సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పంపించారు.

బాలబాలాజీకి విశేష పూజలు

రూ.1,84,745 ఆదాయం

మామిడికుదురు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో స్వామివారికి తొలిహారతి ఇచ్చి సుప్రభాత సేవ నిర్వహించారు. నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని శనివారం 3289 మంది భక్తులు దర్శించుకుని, 2316మంది అన్నదాన ప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,84,745 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.73,150, అన్నదాన విరాళాలు రూ.38,813, కేశఖండన ద్వారా రూ.1,960, తులాభారం, కానుకలు ద్వారా రూ.300 లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.14,250 వెరసి రూ.1,28,743 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 4వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలీషియా కమాండర్ లొంగుబాటు



పోలీసుల ఎదుట లొంగిపోయిన మిలీషియా కమాండర్ తెల్లం బుద్ర

చింతూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ తెల్లం బుద్ర శనివారం లొంగిపోయాడు. చింతూరు ఏఎస్పీ పంకజ్ కమార్ మీనా వివరాల మేరకు.. ఛత్తీసగఢ్‌లోని సుక్మా జిల్లా చిమిలిపెంటకు చెందిన తెల్లం బుద్ర 2010లో మావోయిస్టు పార్టీలో చేరాడు. దీంతో మిలీషియా సభ్యుడిగా మావోయిస్టు పార్టీ బాధ్యతలు అప్పగించింది. తదుపరి 2012లో మిలిషియా కమాండర్‌గా పదోన్నతి కల్పించిన పార్టీ 12 బోర్ తుపాకీ కేటాయించింది. నాటి నుంచి ఇప్పటివరకు సూర్పనగూడ మిలీషియా కమాండర్‌గా పని చేసిన బుద్ర మావోయిస్టు పార్టీ విధానాలకు విసుగు చెంది తమ ఎదుట లొంగి పోయినట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కంపెనీ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పిరమేష్ పాల్గొన్నారు.

'సూపర్-6 అమలులో ప్రభుత్వం వైఫల్యం'

అమలాపురం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తే 6నెలల్లోనే చేయాల్సిందంతా చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరణ కాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఏం ప్రయత్నాలు చేస్తున్నారో ప్రజలకు బహిరంగంగా చెప్పాలన్నారు. తొలుత అమలాపురంలోని గిడుగు స్వగృహం వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, నియోజకవర్గ ప్రతినిధి అయితాబత్తుల సుభాషిణి, చీకట్ల అబ్బాయి, వంటెద్దు బాబి, అయితాబత్తుల కుమార్‌సింగ్ ఉన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 8 నుంచి 13వతేదీ వరకు దూర ప్రాంతాలకు బస్సులను సిద్ధం చేస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

హైదరాబాద్ రూటులో అధికంగా..

హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు 66 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ నుంచి కాకినాడ డిపోకు 34 బస్సులు, హైదరాబాద్ నుంచి పార్వతీపురం ఒక బస్సు, హైదరాబాద్ నుంచి తుని డిపోకు 18 బస్సులు, హైదరాబాద్ నుంచి ఏలేశ్వరం డిపోకు 13 బస్సులు సంక్రాంతి పండుగ సందర్భంగా తిప్పనున్నారు. డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్య పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇతర జిల్లాలకు కూడా బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు. కాకినాడ నుంచి విశాఖపట్నం 10 బస్సులు, కాకినాడ నుంచి పలాస ఒక బస్సు, కాకినాడ నుంచి శ్రీకాకుళం మూడు బస్సులు, కాకినాడ నుంచి విజయనగరం మూడు బస్సులు కాకుండా రద్దీ బట్టి బస్సులు ఏర్పాటుచేయనున్నారు.

బాలభవన్ చిన్నారుల ప్రతిభ
యానాం, జనవరి 4(ఆంధ్రజ్యోతి):ప్రజా ఉత్స వాల సందర్భంగా నిర్వహించిన నృత్యపోటీల్లో జవ హర్ బాలభవన్ చిన్నారులు ప్రతిభ కనబరిచారు. విజేతలను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీ ణ్, బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు, నృత్యకళాకారిణి వాసిరెడ్డి శ్రీవాత్సవి, కరక రా మకృష్ణ, విష్ణుమూర్తి, జ్యోత్స్న అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చాణక్య
మలికిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మేడిచర్ల చాణక్య ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. అధికార ప్రతినిధిగా కనుమూరి రామచంద్రరాజు ఎంపికయ్యారు. గూడపల్లిలో బీ జేపీ మండల అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో నాయకులు మా లే శ్రీనివాసనగేష్,అడబాల రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● మండల సమావేశంలో 2025-26 అంచనాల బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి

పి.గన్నవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కరించే దిశగా సభ్యు లు కృషి చేయాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి ఆమె అధ్య క్షత వహించి అనంతరం మాట్లాడారు. ఈసంద ర్భంగా జరిగిన శాఖలవారీ సమీక్షలో లంకలగ న్నవరంతో పాటు పలు ప్రాంతాల్లో లోహోల్టేజ్ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడు తున్నారని, లైన్లు కలిపోవడంతో విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఏర్పడుతుందని ఎంపీపీ నాగలక్ష్మితో పాటు ఎంపీటీసీ అవనిగడ్డ సత్తి బాబు, సర్పంచ్ పసలపూడి రామకృష్ణలు సమా వేశం దృష్టికి తీసుకువచ్చారు. లంకలగన్నవ రానికి లైన్‌మన్ ఏర్పాటు చేయాలని కోరారు. హౌసింగ్‌కు సంబంధించి నిర్దిష్టమైన మార్గదర్శ కాలు వివరించాలని సంబంధిత అధికారులను కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దొరబాబు కోరారు. లం కలగన్నవరంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు కోసం స్థలం కావాలని ఇరిగేషన్ అధికారులకు దర ఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు సమాధానం రాలేదని, ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని కానీ ప్రజలకు ఉపయోగపడే వాటర్ ట్యాంక్ నిమిత్తం స్థలం కేటాయించడం లేదని ఎంపీటీసీ సత్తిబాబు అధికారులను ప్రశ్నించారు. అలాగే డ్రైన్స్ సమస్యలతో పాటు పలు సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం 2025-26 సంవత్స రానికి అన్ని పద్దులకు సంబంధించి అంచనాల బడ్జెట్ రూ.68,53,76,000 రూపొందించగా వ్య యం రూ.68,53,20,000 మిగులు బడ్జెట్ రూ.56,000 చూపించారు. కుందాలపల్లిలో వాటర్‌ట్యాంక్ నిమిత్తం 2సెంట్లు కేటా యించిన ఎంపీటీసీ పప్పుల సాయిబాబును ఈసంద ర్భంగా సభ్యులు, అధికారులు దుశ్శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో కెవి ప్రసాద్, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఎంపీటీసీల సమైఖ్య అధ్యక్షురాలు కొక్కిరి లక్ష్మి పాల్గొన్నారు.

'ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం'




అమలాపురం: మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అయినవిల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు: మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే దేవ

● జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో 'భోజనం' ప్రారంభం

మామిడికుదురు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథ కాన్ని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు శ నివారం ప్రారంభించారు. దూర ప్రాంతాల నుం చి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రభు త్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని, విద్యార్థులు ఈపథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కళా శాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీ సుకుంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక స ర్పంచ్ గౌస్ మొహిద్దీన్, టీడీపీ మండలశాఖ అ ధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, ప్రి న్సిపాల్ ఏసుబాబు, ప్రధానోపాధ్యాయిని సీహె చ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ కళాశాలలో ప్రారంభం
ముమ్మిడివరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రిన్సిపాల్ పి.ఎల్.ప్రశాంతి, నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ పి.నూకరాజు, మధ్యాహ్న భోజన పథకం ఎడిషనల్ కోఆర్డినే టర్ సురేష్, డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, అర్చన, పీహెచ్‌సీ డాక్టర్ యోగితాలక్ష్మి, అధ్యాప కులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశనపల్లిలో ప్రారంభం
మలికిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేశన పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యా హ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించా రు. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను సద్వి నియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడబాల సాయిబాబు, సర్పంచ్ గుబ్బింక సత్తిబాబు, ఎంపీటీసీ రాపాక సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురు: భోజనం వడ్డిస్తున్న నామన రాంబాబు

విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి
అయినవిల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యా భివృద్ధి ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుం దని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అయినవిల్లిలో శనివారం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఎంతోమంది కి అన్నదానం చేసి అన్నపూర్ణగా నిలిచిన డొక్కా సీతమ్మ పేరు ఈపథకానికి పెట్టడం హర్షణీయ మన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వైసీపీ వైస్ ఎంపీపీని వేదికపైకి పిలిచి జనసే న వైస్ ఎంపీపీని పిలవకపోవడంతో టీడీపీ రా ష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే సర్దిచెప్పి ఇద్దరు వైస్ ఎం పీపీలను వేదికపైకి ఆహ్వానించడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, త హశీల్దార్ నాగలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సర్పంచ్ కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన పోషకాహారం
రాజోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతోమంది నిపుణు ల సలహాలతో మధ్యాహ్న భోజన పథకాన్ని రూ పొందించారన్నారు. హాజరు శాతాన్ని పెంచడం తో పాటుగా నాణ్యమైన పోషకాహారాన్ని అందిం చే దిశగా కళాశాలలో మధ్యాహ్న భోజన పథకా నికి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. కార్యక్ర మంలో గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీను, బోళ్ల వెంకటరమణ, సర్పంచ్ రేవు జ్యోతి, సూరిశెట్టి శ్రీను, పామర్తి రమణ, కుంపట్ల చి న్నారి, అడబాల విజయ్ పాల్గొన్నారు.

జిల్లాలో 13 కళాశాలల్లో ప్రారంభం
అమలాపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యో తి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర ప్ర భుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథ కాన్ని ప్రారంభించినట్టు ఎమ్మెల్యే అయితాబత్తు ల ఆనందరావు తెలిపారు. జిల్లాలో 13 జూని యర్ కళాశాలల్లో 2314మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. అమ లాపురం వెత్సావారి అగ్రహారంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భో జన పథకాన్ని ఆర్డీవో కె.మాధవితో కలిసి ఎమ్మె ల్యే ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ కార్య దర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లా డ స్వామినాయుడు, నాయకులు గండి దేవిహా రిక, దెందుకూరి సత్తిబాబురాజు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ భోజనం ప్రారంభం
ఉప్పలగుప్తం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం డొ క్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిం చారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ ఈకార్యక్రమా న్ని ప్రారంభించి విద్యార్థులకు భోజనం వడ్డిం చారు. కార్యక్రమంలో హెచ్ ఎం లంక రాణి, ఉ పాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ చిత్రమాలికలు, రంగవల్లులు


సైన్స్ ఫెయిర్‌కు సంబంధించి లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

పి.గన్నవరం, జనవరి4(ఆంధ్రజ్యోతి) పి.గన్న వరం హైస్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరావు, కూడిపూడి సూర్య నారాయణలతో కలిసి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ ప్రారంభించారు. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శ నలో సైన్స్ చిత్రమాలికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లాలోని డ్రాయింగ్ ఉపాధ్యాయులు వివిధ రకాల రంగులు, ముగ్గులతో రూపొందిం చినచిత్రాలు ఆకట్టుకున్నాయి. సేవ్‌వాటర్, పర్యా వరణ పరిరక్షణ, టెలిస్కోప్ తదితర చిత్రప టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గైడ్ ఉపా ధ్యాయులు పీఎల్ ప్రమీల కుమారి, పీవీవీ లక్ష్మీదేవి, వీవీ పుష్కరుడు రూపొందించిన మానవశరీరంలోని భాగాలతో కూడిన సెల్ఫీ విత్ సైన్స్ చిత్రపటం ఆకట్టు కుంది. కాట్రేనికోన మండలం పల్లం హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ సత్యనారాయణమూర్తి వివిధ రకాల రంగులతో రూపొందించిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమా ర్, డీఈవో షేక్ సలీం బాషాల చిత్రాలతో వేసిన గ్రౌండ్ ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఏకే భీమారావు, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్రనందం, నాయకులు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామ న రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగ లక్ష్మి, ప్రధా నో పాధ్యాయుడు డీఎస్‌వీ ప్రసాద్, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, స్కూలు చైర్మన్ నల్లా దుర్గారావు, శిరిగినీడి వెంకటేశ్వర రావు, నంసాని పెద్దిరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన ప్రాజెక్టులు:
వ్యక్తిగత విభాగం నుంచి గోడి గురుకుల పాఠశాల విద్యార్థి కె.సల్వినా మేజికల్ అంబ్రెల్లా ప్రాజెక్టులో, ఊబలంక జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి ఎన్.నిఖిల్ విజయకుమార్‌రెడ్డి రైన్ డిఫెక్టర్ టు ప్రొటెక్ట్ క్లాత్స్ ప్రాజెక్టులో, ఐ.పోలవరం హైస్కూల్ విద్యార్థి కె.సంజయ్‌కుమార్ వెహికల్ యాక్సిడెంట్ ప్రాజెక్టులో ఎంపికయ్యారు. గ్రూపు విభాగంలో వన్నెచింతలపూడి హైస్కూల్ విద్యార్థులు పి.రోహిణి, శశివర్ధన్ మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్ ప్రాజెక్టులో, ఊబలంక హైస్కూల్ విద్యార్థులు ఎ.దుర్గాసాయి, ఎ.నోకిధర్ బ్యాంక్ సెక్యూరిటీ సిస్టమ్ యూజింగ్ జీఎస్ఎం ప్రాజె క్టులో ఎంపికయ్యారు. కొండుకుదురు హైస్కూ లు విద్యార్థులు ఎస్.జస్వంత్‌కృష్ణ, సీహెచ్.వి. కార్తీక్‌లు స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టులో ఎంపిక య్యారు. ఉపాధ్యాయ విభాగంలో కొండుకు దురు హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎంఎల్ శ్రీని వాసరావు నంబర్ సిస్టమ్ ప్రాజెక్టుకు, తొండవ రం హైస్కూల్ ఉపాధ్యాయుడు కె.సీహెచ్.ఎన్. జి.నరసింహరావు పేపర్ పల్ప్ మేకింగ్ మెషిన్ ప్రాజెక్టుకు ఎంపికయ్యారు. గొల్లవిల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎ.రామకృష్ణ లోకాస్ట్, నోకాస్ట్ టీఎల్ఎం ప్రాజెక్టులో ఎంపికయ్యారు. విజేతల పేర్లను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ప్రకటించగా మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు వెళ్లనున్న ట్లు జిల్లాసైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఘనంగా మెట్ల జయంతి


అమలాపురంలో మెట్ల ఘాట్ వద్ద జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఆనందరావు, ఎంపీ హరీష్ తదితరులు

అమలాపురంటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరా వు 23వ జయంతి వేడుకలను శనివారం ఘ నంగా నిర్వహించారు. తొలుత కిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు స్మృతి వనం (ఘాట్) వద్ద అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, టీడీపీ ఆర్గనైజింగ్ కార్య దర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అ ల్లాడ స్వామినాయుడు పూలమాలలు వేసి ని వాళులర్పించారు. అనంతరం డాక్టర్ మెట్ల స్మా రక ఆరోగ్య ఉద్యానవనం వద్ద మెట్ల విగ్రహాని కి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆ యా కార్యక్రమాల్లో నాయకులు నల్లా స్వామి, అధికారి జయవెంకటలక్ష్మి, బత్తుల ప్రసాద్, బొ ర్రా ఈశ్వరరావు, దెందుకూరి సత్తిబాబురాజు, బోనం సత్తిబాబు, రాజులపూడి వెంకటేశ్వరరా వు, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. పేదలకు వస్త్రదానం చేశారు.

శునక, వానర స్నేహం

మలికిపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెం కూడలిలో ఐదేళ్లుగా శునక-వా నర స్నేహం కొనసాగుతోంది. ఈ రెండు కలి సికట్టుగానే ఉంటాయి. వీటిని స్థానికులు, బా టసారులు ఇబ్బంది పెట్టరు. శునక-వానర స్నేహాన్ని చూసి పలువురుఔరాఅంటున్నారు.

స్వామివారి ఆదాయం రూ.97వేలు
కొత్తపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మం దపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆల యానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి వారి సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.97,760 ఒక్కరోజు ఆదాయం వచ్చింది.

కిశోరి వికాసంపై శిక్షణ
రాజోలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వైడీకే రమాదేవి ఆధ్వర్యంలో కిశోర వికాసం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్యదర్శిని పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవ గాహన కల్పించారు. సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు, నివారణ, పోక్సో యా క్టు, అత్యాచార బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం తదితర పథకాల గురించి వివరించా రు. ఎంపీపీ కేతా శ్రీను, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, రేవు జ్యోతి, కోఆప్షన్ సభ్యుడు షే క్ ఇస్మాయిల్ సూపర్‌వైజర్లు క్రాంతి, సరస్వతి, బాలాత్రిపురసుందరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

త్వరలో అన్ని పంచాయతీలకు కార్యదర్శులు


డీపీవో శాంతలక్ష్మి

మలికిపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): త్వరలో అ న్ని పంచాయతీలకు కార్యద ర్శులను నియమిస్తామని జి ల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి చెప్పారు. మోరి పంచాయతీకి తనిఖీకి వచ్చిన శాంతలక్ష్మి మాట్లాడుతూ చా లామంది గ్రేడ్-3 కార్యదర్శులకు పదోన్నతులు రానున్నాయని, వాటి ద్వారా 92 కార్యదర్శి పోస్టులు భర్తీ అవుతాయన్నారు. నెల రోజుల్లో మిగిలిన వారికి కూడా పదోన్నతులు వస్తాయ ని, తద్వారా కార్యదర్శుల నియామకాలు పూర్త వుతాయన్నారు. జిల్లాలో 385పంచాయతీలకు 263మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారన్నా రు. పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటికి అ ధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, పారిశుధ్యం ఎ క్కడ లోపించినా చర్యలు తీసుకుంటామన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో ప్రతీరోజు చెత్త ను స్వీకరించేలా ఆదేశాలిచ్చామన్నారు. ఇప్పటి కే పంచాయతీలు సేకరించిన ప్లాస్టిక్ తదితర వాటిని తూర్పుపాలేనికి చెందిన ఒక సంస్థ కి లోకు రూ.7 చెల్లించే విధంగా ఎంవోయూ జరి గిందన్నారు. ప్రజల్లో కూడా చైతన్యం రావాలని, ఎక్కడికక్కడే చెత్త పాడవేసే విధానాన్ని మా నుకోవాలన్నారు. జిల్లాలో 32డంపింగ్ యార్డు లు ఉన్నాయని, అవసరమైన వాటి కోసం ప్ర యత్నాలు చేస్తున్నట్టు తెలిపారు.

స్వామివారికి లక్ష తులసిపూజ
ముమ్మిడివరం, జనవరి4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామివారి ని విశేషంగా అంకరించి లక్ష తులసి పూజ, విశేష పూజలు జరిపించారు.

సంక్రాంతి సంబరాలు
ముమ్మిడివరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం శ్రీబాలాజీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతి సంప్ర దాయాలను విద్యార్థినీ విద్యార్థులు తెలుసుకు నే విధంగా పలు సాంస్కృతిక సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత విద్యా ర్థులు ఆయురారోగ్యాలతో ఉండాలని సంప్ర దాయ బద్ధంగా వస్తున్న భోగిపళ్ల కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం భోగిమంట లు వేసి రంగవల్లులతో తీర్చిదిద్దారు. బొమ్మ ల కొలువ, చెడీ తాలింఖానా, ప్రభలోత్సవం, పిండి వంటలతో సంప్రదాయ దుస్తులు ధ రించి విద్యార్థులు ఆనందోత్సాహాలతో సం క్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్ర మంలో కరస్పాండెంట్ పి.సుజా, వ్యవస్థాప కుడు పీవీఎస్ శాస్త్రి, హెచ్ఎం వీవీ రామరా జు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కోసం బయటకు తీసిన రథం

అంతర్వేది, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆల యంలో మాఘమాసంలో జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం రథాన్ని శని వారం షెడ్డు నుంచి బయటకు తీశారు. తొలుత అర్చకులు ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం రథాన్ని భక్తులు షెడ్డు నుంచి ఆలయ ప్రాంగణంలోకి తీసుకువ చ్చినట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆల య సూపరింటెండెంట్ పి.విజయసారథి, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ ది రిశాల బాలాజీ, పొన్నాల విజయ్, గంటా నాయుడు, పోతురాజు వెంకట కృష్ణ, అగ్నికుల క్షత్రియులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి
అంబాజీపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాచవరం భవితా కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈవో-2 మోకా ప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు బిస్కెట్లు, స్వీట్లు, ప్లేట్లను దివ్యాంగ విద్యార్థులకు అందించారు. ఈఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, సీఆర్పీ నాగరాజు, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో వేడుకలు
ఉప్పలగుప్తం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం భవిత కేంద్రంలో శనివారం లూయీ బ్రెయిలీ జయంతిని జరుపుకున్నారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో గొల్లవిల్లి హైస్కూల్ హెచ్ఎం లంక రాణి, ఉప్ప లగుప్తం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.శ్యామలాదేవి, ఎస్‌ఏ ప్రత్యేక ఉ పాధ్యాయుడు వై.విజయకుమార్, భవిత టీచర్లు సీహెచ్ గంగాదేవి, పి. వెంకటేష్, ఎంఆర్సీ సిబ్బంది బి.జాన్బాబు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన బస్సుల ప్రారంభం
రాజోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ రాజోలు డిపోలో ఐ దు నూతన బస్సులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం ప్రా రంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ప్రయాణాన్ని అందించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ పనిచేస్తోందని తెలిపారు. రాజోలు డిపో నుంచి ఈఐదు నెలలు మొత్తం 11ఆర్టీసీ బస్సులను ప్రారం భించామని తెలిపారు. ఆర్టీసీ డీఎం ధనమ్మ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్ రేవు జ్యో తి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

నేరాలు, దొంగతనాల అదుపునకు సీసీ కెమెరాలు
అల్లవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల పరిధిలోని గ్రా మాల్లో నేరాలు, దొంగతనాలు అరికట్టేందుకు పోలీసు శాఖ పర్యవేక్షణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దేవగుప్తం, డి.రావులపాలెం, బెండమూ ర్లంక సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ జి.హరీష్‌కు మార్ తెలిపారు. రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ సూచనలపై అల్లవరం, గుడ్డివానిచింత, కోడూరుపాడు సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్య లు తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వ్యాపారవేత్త బండిగుప్తాపు పాండు రంగతో పాటు వ్యాపారులు సొంత ఖర్చుతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. దేవాలయాలు, వ్యాపార దుకాణాల్లో ఇటీవల దొంగ తనాలు జరగడంతో సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలీసు నిఘా పెంచారు.

7 నుంచి క్రీడోత్సవాలు
ముమ్మిడివరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జడ్పీ బాలుర, బాలికలఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మండ లస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తాడి వెంకటాచార్య తె లిపారు. కోనసీమ క్రీడోత్సవాలు-ఆటలతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల7నుంచి 9వరకు ఆటల పోటీలు జరుగుతాయన్నారు. 4,5,6 తరగతు లకు వంద మీటర్లు, 200మీటర్ల రన్నింగ్,త్రోబాల్ పోటీలు, సీనియర్స్ విభా గంలో 7,8,9తరగతుల బాలుర, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మిం టన్, క్రికెట్, అథ్లెటిక్స్ పోటీల్లో మండలస్థాయిలో జరుగుతాయన్నారు. మం డలస్థాయిలో గెలుపొందిన బృందాలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చే స్తారన్నారు. ఈపోటీలు పీడీఎస్, పీఈటీల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

రేపు ఉద్యోగ మేళా
ముమ్మిడివరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జి ల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జనవరి 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీల్లో 250కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బి.ఫార్మసీ, పీజీ చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డి నేటర్ యు.శ్రీదేవి 8341648470, డీపీవో కె.రాజేంద్ర సెల్ 8247645389లను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీ అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్టుసైజు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

శెట్టిబలిజ భవన నిర్మాణ పనులకు విరాళం
ముమ్మిడివరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ సంఘ నాయకుల సమావేశం ముమ్మిడివరంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో సానబోయి న మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శెట్టిబలిజ కులస్తు లకు సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై వ్యూహరచన చేశా రు. సమావేశానికి విచ్చేసిన అమలాపురానికి చెందిన శెట్టిబలిజ నాయకు లు కల్యాణ మండప నిర్మాణం అసంపూర్తిగా ఉండడాన్ని గమనించి తన వంతు విరాళంగా రూ.50వేలు ప్రకటించి శెట్టిబలిజ ప్రతినిధులకు అందజే శారు. అనంతరం వారంతా రామచంద్రపురం రాజ్యసభ సభ్యుడు పిల్లి సు భాష్‌చంద్రబోస్‌ను కలిసి నిధుల కేటాయించాలని కోరగా ఎంపీ ల్యాడ్స్ నుంచి కొన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇ చ్చారు. కార్యక్రమంలో దొమ్మేటి రమణకుమార్, దొమ్మేటి అప్పారావు, కడలి నాగు, రెడ్డి శివన్నారాయణ, మట్టపర్తి సురేష్, బొక్కా జయరమేష్, కాంద్రే గుల త్రిమూర్తులు బొంతు శ్రీనివాస్, రాయుడు చిన్నా, గొవ్వాల రాజేష్, చె ల్లుబోయిన నాని, ఇళ్ల కిశోర్, దొంగ బాలాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ
ముమ్మిడివరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు పాయసం తిరుమలరావు(బుజ్జి) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాప చింతలపూడికి చెందిన తిరుమలరావు గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. ఎమ్మెల్యే బుచ్చిబాబు తిరుమలరావు కుటుంబాన్ని పరా మర్శించి, తిరుమలరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. నాయకులు గొలకొట్టి దొరబాబు, తాడి నరసింహరావు, దొమ్మేటి రమ ణకుమార్, చింతలపూడి బాబురావు, మాదాల నాగసత్యమంగకుమారి, మద్దాల బుజ్జి, గంజి జాజి, గొల్లపల్లి గోపి, పాయసం హరిబాబు, మాదాల ప్రకాష్, బురుగు కళ్యాణ్, పితాని రామకృష్ణ, గొవ్వల శ్రీను పాల్గొన్నారు.

యానాంలో ఘనంగా 'మన ఊరు శుభ్రత'

పనులను పరిశీలిస్తున్న మల్లాడి

యానాం, జనవరి4(ఆంధ్ర జ్యోతి): యానాంలో శనివారం ఉదయం మన ఊరు శుభ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రత్యేక ప్రతి నిధి మల్లాడి కృష్ణారావు ఇచ్చిన పిలుపు మేరకు యానాం ప్రజలస్వచ్ఛంద సేవాసంస్థ, పలువురు దాతల సహకారంతో ఒక్కరోజు మన ఊరు శుభ్రత (స్పెషల్‌డ్రైవ్) కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగిక్రీ డా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్లాడి మాట్లాడారు. యానాంలో పారిశుధ్యాన్ని స్థానిక ప్రజాప్రతినిధి, హెచ్ఆర్ స్మేర్ సంస్థలు గాలికి వదిలేసారన్నారు. 50ట్రాక్టర్లతో 500 మంది సిబ్బంది ని యోజకవర్గం మొత్తం పారిశుధ్య పనులు చేపట్టారు. పారిశుధ్య పనులను మోటార్‌సైకిల్‌పై వెళ్లి మల్లాడి పరిశీలించారు.

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలి
ముమ్మిడివరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి న బేటీ బచావో.. బేటీ పడావో పథకాలపై పూర్తి అవగాహన ఏర్పరుచు కుని వాటిని సక్రమంగా అమలు చేయాలని ముమ్మిడివరం సీడీపీవో ఐ. విమల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ, వార్డు, మహిళా సంరక్షణ కార్యద ర్శులకు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు, పాఠశాల ఉపా ధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీడీవో తాడి శ్రీ వెంకటాచార్య మాట్లాడుతూ కిశోర బాలికల్లో ఆరోగ్యం, రక్షణపై తల్లిదం డ్రులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ పి. రవివర్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరిం చారు. డీసీపీయూ యూనిట్ ప్రతినిధి మోర్త మహాలక్ష్మి మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, బాల కార్మిక నిర్మూలన గురించి వివరించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు యోగిత, మెప్మా సీఎంఎం ఎస్.భాస్కర్, కా ర్యాలయ పర్యవేక్షకులు సీహెచ్ పల్లవి, జీవీఎస్ఎన్ దేవి పాల్గొన్నారు.

బేడ బుడ్గ జంగాలను ఎస్సీలుగా గుర్తించాలి
మామిడికుదురు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బేడ బుడ్గ జంగాలను ఎస్సీ లుగా గుర్తించాలంటూ బేడబుడ్గ సంఘ మండల నాయకులు శనివారం వినతిపత్రాన్ని తహశీల్దార్ ఆచార్యులుకు అందించారు. గతంలో రాష్ట్రంలో తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం తమ కు కులధ్రువ పత్రం ఇవ్వడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో నివశి స్తున్న తమను కూడా కులాల వర్గీకరణ రిజర్వేషన్లలో నమోదు చేయా లని కోరారు. కుల వర్గీకరణలో తమను ఎస్సీ కులంలో నమోదు చేయాల ని కోరారు. ముగ్గు పిచ్చియ్య, ముగ్గు త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్
ముమ్మిడివరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తాణేలంకలోని వరగలంకలో ఓ కిరాణాషాపులో త్రాచుపాము చేరి హల్‌చల్ చేయడంతో షాపు యజ మాని, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ గణేష్‌వ ర్మకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి సీసాలో పామును బం ధించారు. అటవీప్రాంతంలో పామును వదిలివేస్తామని వర్మ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
అంబాజీపేట, జనవరి4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలలో మెనూ ప్రకా రం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తహశీల్దారు జె.వెంక టేశ్వరరావు సూచించారు. స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. భోజనాన్ని రుచిచూసి సంతృప్తివ్యక్తం చేశారు. ఆర్ఐ ఏడుకొండలు, హెచ్ఎం కడలి సాయిరామ్, వీఆర్వో రమణ పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సన్మానం
అంబాజీపేట, జనవరి4(ఆంధ్రజ్యోతి): తొండవరం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు మంచి బోధన అందించిన ముషిణి వెంకటే శ్వరరావు సేవలు అమూల్యమైనవని ఎంఈవో-2 మోకా ప్రకాష్ అన్నారు. స్థానిక పాఠశాలలో వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ హెచ్ఎం పీవీ కేశవచార్యులు అధ్యక్షతన జరిగింది. అనంతరం వెం కటేశ్వరరావు దంపతులను దుశ్శాలువా, పూలమాలలో సత్కరించారు. కార్య క్రమంలో ఎంపీటీసీ వడ్లమాని పద్మావతికామేశ్వరరావు, ఉపాధ్యాయులు మట్టపర్తి రాంబాబు, ఆదుర్తి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.యానాం బీచ్‌కు రెండో రహదారి
ఉప్పలగుప్తం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన గ్రామం నుంచి బీచ్‌కు మరో రహదారి నిర్మించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనం దరావు నిర్ణయించారు. ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి సంబరాల నిర్వహ ణకు ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఆయన స్థానిక నాయకులతో బీచ్ లో సమీక్ష నిర్వహించారు. బీచ్ వాలీబాల్ పోటీలకు అధిక సంఖ్యలో జనం తరలి రావడంతో చివరి రోజున ట్రాఫిక్ జామ్‌తో ఎక్కడి వాహనాలు అక్క డే నిలిచిపోయాయి. ప్రధాన గ్రామం నుంచి ఒకే రహదారి ద్వారా రాకపోక లు జరగడంతో ఈ ట్రాఫిక్ చిక్కులు ఏర్పడినట్టు గుర్తించారు. ప్రస్తుత ర హదారికి సమాంతరంగా మరో రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామపెద్ద లు ఎమ్మెల్యేకు సూచించారు. వెంటనే మరో రహదారి ఏర్పాటుకు మ్యాప్‌ను రూపొందించి నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నీలిమకు రూ.4.10లక్షల సాయం
అంతర్వేది, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక గ్రామానికి చెంది న మార్గాని నీలిమ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆ సుపత్రిలో చికిత్స పొందుతోంది. మార్గాని కొండలరావు కుమార్తె నీలిమ మె రుగైన వైద్యం కోసం గ్రామస్తులు, యువకుల సహకారంతో సమకూర్చిన రూ.4.10లక్షలను సర్పంచ్ రేవూరి రాజేశ్వరి భర్త ఏసు శనివారం అందిం చారు. ఇప్పటికే రూ.35లక్షలు వైద్య ఖర్చు అయ్యాయని, ఇంకా రూ.40లక్ష లు అవసరం అవుతాయని వైద్యులు చెప్పడంతో గ్రామస్తులు సహాయం చేయడం స్ఫూర్తినిచ్చిందని రేవూరి ఏసు అన్నారు. కార్యక్రమంలో కొండా కి శోర్, పడాల శంకరం, రేవూరి వాసు, పడాల నాగబాబు, గునిశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు, కె.దొరబాబు, యల్లమిల్లి కిశోర్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సత్తిబాబు
పి.గన్నవరం, జనవరి4(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగతఎన్నికల్లో భాగంగా మొండెపులంకలో శనివారం జరిగిన బీజేపీ సమావేశంలో నూతన మండల అధ్యక్షుడుగా తిక్కా సత్తిబాబు ఎంపికైనట్లు బీజేపీ జిల్లా ఎన్నికల పర్య వేక్షకుడు మాలే శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా సత్తిబాబును బీజేపీ నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సీనియర్ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరరావు, పసుపులేటి శివశంకరప్రసాద్, కోటి శివాజీ, కంకి పాడు సుబ్బారావు, చిట్టినీడి రంగసాయి, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆలయంలో భక్తుల సందడి

కొత్తపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే సర్వ దర్శనాలు, తైలాభిషేకాలకు అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.97,760 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



పొలం పిలుస్తోందిలో డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సత్యానందరావు

వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం ఈతకోట వద్ద పొలం పిలుస్తోంది నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అక్కడ ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరాలు, స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, వంటిపల్లి పాపారావు, యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, మిరియాల రాము, చవల జగన్నాథం, కూటమి శ్రేణులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసుల నమోదుపై సర్పంచ్‌ల నిరసన

రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

ద్రాక్షారామ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం, తాళ్లపొలం సర్పంచ్‌లపై తప్పుడు కేసులు నమోదు చేశారని పలువురు వైసీపీ సర్పంచ్‌లు నిరసన తెలిపారు. రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన జరిగింది. తప్పుడు కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేస్తూ సమావేశ మందిరంలోకి చేరుకున్నారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం మాట్లాడుతూ వెంకటాయపాలెం సర్పంచ్‌పై రూ.20 వేలు తీసుకుని సామాజిక భవనం అద్దెకు ఇచ్చారని తప్పుడు కేసు పెట్టారన్నారు. తాళ్లపొలం సర్పంచ్ గోవిందుపై కూడా కేసు పెట్టారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి తనపై తప్పుడు కేసు ఎందుకు పెట్టారని ఏఈ యేసురత్నంను ప్రశ్నించారు. కాపవరం ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులపై కేసులు మంచి పద్ధతి కాదన్నారు. వెల్లలాకులు శిథిలమయ్యాయని ఎప్పుడు మరమ్మతులు చేయిస్తారని ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామి ప్రశ్నించారు. సభలో పలు అంశాలను ప్రజా ప్రతి నిధులు లేవనెత్తారు. అనంతరం ప్రభుత్వ శాఖలపై అధికారులతో సమీక్ష చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీడీవో కదలి పద్మజ్యోతి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

మంత్రి వాసంశెట్టి సుభాష్



మాట్లాడుతున్న కార్మికశాఖా మంత్రి సుభాష్

కె.గంగవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నియోజకవర్గాన్ని అన్ని విధాలా నాశ నం చేసిందని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నవరత్నాలకు ప్రాధాన్యమిచ్చి అభివృద్ధిని అట కెక్కించిందన్నారు. జగనన్న లేఅవుట్ల మెరక పనుల దగ్గర నుంచి ప్రతి అంశంలోనూ అవినీతి చేశారని వాటి లెక్కలు తీస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. నియోజకవర్గంలో సంక్రాంతి నాటికి రోడ్లన్నిటినీ పూడ్చాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి నాటికి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవోఆర్‌డి గైరీ కుమారిని ఆదేశించారు.

మిగులు బడ్జెట్ ఆమోదం: సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండల పరిషత్‌కు వివిధ రూపాల్లో రూ. 35,22,06,723లు ఆదాయం వస్తుందని, రూ. 35,20,31,966లు వివిధ పద్దుల వ్యయం అవుతుందని అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ రూ. 1,74,757 మిగుల బడ్జెట్‌ను ఆమోదించింది. సమావేశంలో పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని తెలిపారు. దీనిలో ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబిళినేని శ్రీవరలక్ష్మి, వైఎస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, ఎంపీడీవో ఎన్. శ్రీనివాసరావు, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, డీసీ అధ్యక్షులు దాట్ల విజయగోపాల్ రాజు, నిడదవోలు సుబ్బు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు: మండల పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంత్రి సుభాష్‌తో పలువురు వాటిని పరిశీలించారు. విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు మంత్రి బహుమతులు ప్రదానం చేశారు.

లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు

రాయవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం భవిత కేంద్రం వద్ద ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐఈఆర్టీలు ఆధ్వర్యంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్ర, బ్రెయిలీ లిపి విశిష్టత వివరించారు. అనంతరం అంగన్‌వాడీలు, ఐఈఆర్టీలు ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు పి.ఆదర్శ్, టి.వీరవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలం లొల్ల ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత సెంటర్‌లో శనివారం లూయిస్ బ్రెయిలి జయంతి జరిపారు. హెచ్‌ఎం బెనర్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 సాహెబ్ పాల్గొన్నారు. ప్రపంచ అంధులకు లూయిస్ ఒక దిక్సూచని పేర్కొన్నారు. అంగవైకల్యం ఎదుగుదలకు ఏ మాత్రం అడ్డురాదని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. అనంతరం లూయిస్ బ్రెయిలి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, జి.రమ్య, కృష్ణకుమారి, అరుణ, కె.జానకీ పాల్గొన్నారు. విద్యార్థుల సమక్షంలో కేక్‌కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.

భీమేశ్వరాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పూజలు

ద్రాక్షారామ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని కాకినాడ జిల్లా ఎస్పి విక్రాంత్‌పాటిల్ శనివారం సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.



భీమేశ్వరాలయంలో ఆశీర్వచనం పొందుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు

7న మండల పరిషత్ సమావేశం

కపిలేశ్వరపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరంలో 7న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుతో రైతుల్లో హర్షాతిరేకాలు

మంత్రి సుభాష్



నెలపర్తిపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రిసుభాష్

ద్రాక్షారామ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రైతులను భయాందోళనకు గురిచేసిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుతో రైతులు ప్రశాంతంగా ఉన్నారని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రీసర్వేతో ప్రజలు ఇబ్బందులుపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేసిందన్నారు. రీసర్వేతో వచ్చిన సమస్యలు, ఇతర భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, తహశీల్దార్ ఎం.సావిత్రి, దేవదాయశాఖ మండల అధికారి శ్రీదేవి, సర్పంచ్ ఆర్.సీతామహాలక్ష్మీ, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, ప్రగతి చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ రాయుడు వీర్రాజు, వల్లూరి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రికి నెలపర్తిపాడు గ్రామస్తులు, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.

నెలపర్తిపాడు బస్సు సర్వీసు ప్రారంభం: రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు, రాజమహేంద్రవరం బస్సు సర్వీసును మంత్రి సుభాష్ శనివారం ప్రారంభించారు. నెలపర్తిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో నెలపర్తిపాడు-రాజమహేంద్రవరం ఆర్టీసీ సర్వీసుకు మంత్రి పూజలు జరిపారు. అనంతరం జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో అఖిల, ఆర్టీసీ డీపీటీవో శ్రీనివాస్ తదితరులతో పాటు పలువురు టీడీపీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు గర్వకారణం

రామచంద్రపురం(ద్రాక్షారామ): ఇంటర్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం గర్వకారణమని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.27.39 కోట్లు, వచ్చే ఏడాది రూ.85.8 కోట్లు వెచ్చించనుందన్నారు. విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. అనంతరం ఆర్డీవో అఖిల, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ వీరన్న, టీడీపీ నాయకులు అక్కల రిష్వంత్‌రాయ్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల విద్యార్థులతో కలసి భోజనం చేశారు.



రావులపాలెంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు



మండపేటలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



రాయవరంలో మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందించడమే లక్ష్యం

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ప్రజా ప్రతినిధులు

రావులపాలెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకే ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిందని ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీ, ఎమ్మెల్యే కూటమి నాయకులతో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వక్తలు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు ఈ పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు తదితరులతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

భోజనాన్ని రుచి చూసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యను అందించడంతో పాటు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటకు చెందిన డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఏడిద రోడ్డులో వున్న ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు భోజనం వడ్డించటంతో పాటు వారితో కలిసి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ఎన్.రామచంద్రరావు, సోమిరెడ్డి, పట్టణ ఎస్ఐ హరి కోటిశాస్త్రి, కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పలరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, మాచర ప్లస్ టు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. అంగర జడ్పీ హెచ్‌ఎస్‌లోని ప్లస్ టులో 12 మంది విద్యార్థులకు నలుగురు మాత్రమే భోజ నం చేసినట్టు హెచ్‌ఎం ఎ.రాజు తెలిపారు. మాచర ఉన్నత పాఠశాలలోని ప్లస్ టులో 14 మంది విద్యార్థులకు 13 మంది భోజనం చేసినట్టు పాఠశాల హెచ్‌ఎం రమాదేవి తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు, ఎంఈవోలు, ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, కళాశాల అధ్యాపకుడు డీవీవీ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

కె.గంగవరం: జూనియర్ కళాశాల విద్యార్థులకు రుచికరమైన, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలని మంత్రి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. శనివారం పామర్రు జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమం లో ఎంపీపీ పంపన నాగమణి, కూళ్ల నీటి సం ఘం అధ్యక్షుడు ఎనుమల గోపాలకృష్ణ, సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకటదుర్గ, నానావరపు కల్యాణి, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, నున్న వీరవెంకట సత్యనారాయణ, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి బీమా అందచేత

ద్రాక్షారామ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామకు చెందిన ఎలక్ట్రీషియన్ చెల్లే శ్రీనివాసరావుకు బీమా సొమ్మును శనివారం ప్రసన్నాంజనేయ లైటింగ్, డెకరేషన్, టెంట్, సౌండ్ సిస్టం సంక్షేమ సంఘం ప్రతినిధులు అందించారు. యూనియన్ తరఫున ప్రధాని మోదీ ప్రవేశపెట్టి పోస్టల్ ఇన్సూరెన్సు రూ 399 చెల్లించారు. ప్రమాదవశాత్తు శ్రీనివాసరావు మరణించడంతో రూ.10లక్షలు బీమా పరిహారం యూనియన్ అధ్యక్షుడు పిట్టా చినబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు శిరి శ్రీను తదితరులు శ్రీనివాసరావు కుటుంబీకులకు అందచేశారు.

గోదాదేవికి 140 రకాల సారె సమర్పణ

మండపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) మండపేట వాసవిమాత ఆలయంలో గోదాదేవికి ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 140 రకాలు పండి వంటలను చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గోదాదేవికి పూజల అనంతరం సారెను సమర్పించారు.



విశ్వరూప అవతారంలో వేంకటేశ్వరస్వామి

విశ్వరూప అవతారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

రాయవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 45వ దశావతార ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం వెంకటేశ్వరస్వామి విశ్వరూప అవతారంలో అలంకరించబడి పూజలందుకున్నారు. భక్త సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు అర్చకత్వంలో స్వామివారికి అర్చనలు, హారతులు, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం దశావతారాలతో ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దశావతారాలను దర్శించుకున్నారు.

మాట మీద నిలబడే అలవాటు లేదా?

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై ఎమ్మెల్యే వేగుళ్ల ఫైర్

మండపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట మీద నిలబడే వ్యక్తికాదని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. మండపేట టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వేగుళ్ల మాట్లాడారు. పట్టణంలో డిసెంబరు 31న జరిగిన నూతన సంవత్సర వేడుకల స్థలం, లేఅవుట్ భూములను రైతుల నుంచి ఎమ్మెల్సీ లాక్కున్నారని ఆరోపించారు. లే అవుట్‌లో స్థలాలు మీకు లేవా? అంటూ ఎమ్మెల్సీ తోటను ప్రశ్నించారు. అక్కడ పార్టీలో ఎవరున్నా పోలీ సులు, చట్టం తన పని చేసుకుపోతుందని వేగుళ్ల అన్నారు. రాజకీయాల్లో మాట మీద నిలబడని తోటను ప్రజలు ఓడించినా ఆయన లో మార్పు రాలేదన్నారు. తాను స్వచ్ఛమైన రాజకీయాలు మాత్రమే చేస్తానని కక్షధోరణి ఉండదన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాకుంటే పేరు మార్చుకుంటానని చెప్పిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పేరు మార్చుకున్న విషయాన్ని వేగుళ్ల గుర్తు చేశారు. మాట మీద నిలకడలేని తోట సవాళ్లను విసర డం ఎందుకన్నారు. తనకు మద్యం, ఇసుకల్లో వాటాలు వున్నాయంటూ తోట చేసిన వ్యాఖ్యలను వేగుళ్ల స్వాగతించారు. తనకు వాటాలుంటే సాక్ష్యాలతో నిరూపించాలని తోటకు సూచించారు.



పాలతోడులో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పాలతోడులో ఉచిత పశువైద్య శిబిరం

మండపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం పాలతోడు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో పశువులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిల్లా తాతాలు, గుణ్ణం సత్యసాయిబాబా, పాలతోడు సాగునీటి సంఘ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, యేలేటి వెంకట్రావు, దొడ్డా రాంబాబు, వల్లూరి అబ్బు, పిల్లా శ్రీనివాస్, సరాకుల అబ్బులు, పాలతోడు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మీ, బొక్కా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి కావాలి

కొత్తపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు పేర్కొన్నారు. శనివారం ప్లెక్సీ ప్రచారాన్ని రావులపాలెం సర్కిల్ పరిధిలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించండి...ప్రాణాలను కాపాడుకోండి హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం అని నినాదాలతో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారం వాహనదారులందరికి అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ లేని ప్రయాణం చేయవద్దని హెల్మెట్ ప్రయాణం సురక్షితమంటూ ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు ఎస్ఐ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ వాడాలంటూ ప్రచారంలో పాల్గొన్న డీఎస్పీ గోవిందరావు, ఎస్ఐ సురేంద్ర

రేషన్ షాపుల భర్తీకి చర్యలు

కొత్తపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో 61 రేషన్ షాపుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్టు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు రెవెన్యూ, తహశీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు పొంది 10వ తేదీ లోపు ఆర్డీవో కార్యాలయానికి అందించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 19 రాతపరీక్ష నిర్వహించి 22, 23 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 24న నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

కపిలేశ్వరపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర గ్రామాభివృద్ధికి ఓఎన్జీసీ తోడ్పాటు అందించి అభివృద్ధి చేయాలని విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ అన్నారు. శనివారం అయన మాట్లాడుతూ ఓఎన్జీసీ సైట్ నుంచి శుక్రవారం గ్యాస్ లీకై ప్రజలు భయాందోళనలు చెందారన్నారు. దీనిపై ఆ సంస్థ సైట్ ఇన్‌చార్జ్ సుబ్బారావుతో మాట్లాడినట్టు తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సైట్ నుంచి సైరన్ మోగాల్సి ఉండగా మోగలేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. సంస్థ అధికారులు తమ గ్రామ సభ్యులను పట్టించుకోనట్టయితే కార్యకలాపాలను నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

మంత్రి సుభాష్ పనితీరుపై దంగేరు మాజీ సర్పంచ్ అసంతృప్తి

కె.గంగవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంట ఇక తాను నడవలేనని దంగేరు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి అన్నారు. క్యాడర్‌ను ఆయన సంతృప్తిపరచలేకపోతున్నారని ఆయన పనితీరు నచ్చక ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక బహిరంగ లేఖను పత్రికలకు విడుదల చేశారు. గతంలో రామచంద్రపురం నియోజకవర్గానికి నాయకత్వం వహించిన నాయకుల పనితీరుతో మంత్రి సుభాష్ పనితీరును ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని చెప్పారు. మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసి 6 నెలలు పూర్తి చేసుకున్నా ఇప్పటికీ దంగేరు గ్రామంలో ఏ ఒక్క అభివృద్ధి పనీ చేయలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసంతృప్తికి లోనై ఇక ఆయన నాయకత్వంలో పనిచేయడానికి ఇష్టపడడం లేదన్నారు.

దుప్పట్ల పంపిణీ

రావులపాలెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు కృష్ణసందీప్ చిన్నారులకు దుప్పట్లు, రగ్గులు, పండ్లు అందించారు. కార్యక్రమంలో మేడపాటి కాసురెడ్డి, దండు విజయరాజు, మల్లిడి చిట్టిరెడ్డి, ఎం.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ

రావులపాలెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ కళాశాల టీచర్స్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డాక్టర్ బీపీ నర్సారెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పీపీ చంద్రబోస్, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, అధ్యాపకులు హరిబాబు, రమేష్‌బాబు, రాజేంద్ర, శ్రీనివాస్, యువరాజు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరావాలి

ఆత్రేయపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావాలని హిందులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకులు అల్లు భాస్కరరావు, కాలాబత్తుల చిన్నారి, చేకూరి రమేష్‌వర్మ తదితర బీజేపీ శ్రేణులు హైందవ శంఖారావం సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కోనసీమలో 300 బస్సులు విజయవాడ బయలుదేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి దీపారాధన స్టాండ్‌లు బహూకరణ

రాయవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం దాత వితరణతో దీపారాధన స్టాండ్‌ను, బంగారు ఆభరణాల నిమిత్తం రూ. లక్ష, గ్రామానికి చెందిన దేవళ్ల వీర వెంకట సత్యనారాయణ చౌదరి వితరణతో 45 వేలతో దీపారాధన స్టాండ్‌లు బహూకరించారు. బంగారు ఆభరణాల నిమిత్తం ఆంధ్ర పెద్ద వీర్రాజు కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందించారు. మల్లిడి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు 50 వేల విలువైన సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్‌లను బహూకరించారు. అనంతరం వైకుంఠ ఏకాదశి ఉత్సవ కమిటీ ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ముక్కోటి ఏకాదశి కమిటీ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.